

సెప్టెంబర్ 9న చలో వరంగల్ కు కదలాలి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 3 సంచిక -78 ఆదివారం 23 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

## కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
అత్యున్నత విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందించేందుకు తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందాన్ని కోరారు. దీనికోసం విద్యారంగంలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో సమావేశం నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా పాల్గొన్నారు.



మిగతా 2లో.



# 10,060 ఉద్యోగాలు

### విడుదలైన ఏపీ జాబ్ క్యాలెండర్ -4 దశల్లో 10,060 ఉద్యోగాలు

### సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరుసగా నోటిఫికేషన్లు

**అమరావతి ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన "జాబ్ క్యాలెండర్–2026"ను విడుదల చేసింది.

మిగతా 2లో.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష
- 'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

2లో.




# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

### భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

2లో.



# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

### ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీ

### బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సులో చంద్రబాబు



**విశాఖపట్నంఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీగా విశాఖపట్నం ఉందని ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడ శాఖల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమం 2026కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు సీఎం స్వాగతం పలికారు. భారత తూర్పు తీరంలో విశాఖ దేశానికే ఆభరణమని అభివర్ణించారు.

మిగతా 2లో.

# కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం
- ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి
- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు



**హైదరాబాద్ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో.

# పెట్టుబడులకు తెలంగాణాని వేదికగా ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి,

మిగతా 2లో.






# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్

**హైదరాబాద్ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది.

మిగతా 2లో.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# 10,060 ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆగస్టు 22, 2026న జీవో నెం.81ను జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), డీఎస్సీ వంటి నియామక సంస్థల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, “స్వర్ణాంధ్రఏ2047“ లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్–1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్–1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్–1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఎస్టీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి. ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్–××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్–2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్–2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సబ్–ఇన్‌స్పెక్టర్: 25 సబ్–రిజిస్ట్రార్ గ్రేడ్–××: 7 సచివాలయం, హెచ్‌ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్&బీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**ఢిల్లీ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. “సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది,“ అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.




ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా ‘యువ సంవాద్‘ (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు. అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

**‘వందేమాతరం‘పై బీజేపీ తీర్మానం**

ఇదే సమయంలో, ‘వందేమాతరం‘ గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# పెట్టుబడులకు తెలంగాణాని వేదికగా ఎంచుకోండి

**మొదటిపేజీ తరువాయి**

పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన ’గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్–2026’లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. ÷లంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025?26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (ఉ÷ూఆఖ) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు.

÷ఎఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన ’తెలంగాణ రైజింగ్?2047’ దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్టాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే అజఖీఇ, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఖీంఖీఇ?ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి‘ అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్‌గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు. తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరు?వ్యవసాయం?ఆహార భద్రత?పరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు.

# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు

**మొదటిపేజీ తరువాయి**

సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖను పిలుస్తారని బ్రిక్స్ దేశాల మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఉద్ఘాటించారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ – ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతున్నట్లు వ్యాఖ్యానించారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరిజానికి విశాఖలో అపార అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యువత ఆకాంక్షలకు ప్రతీకగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దుతున్నట్లు పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళికంగా భిన్నమైనా.. క్రీడలతో బ్రిక్స్ దేశాల ఐక్యత ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. క్రీడలు పోటీ మాత్రమే కాదని... సంస్కృతి, జీవన విధానమని తెలిపారు. యువతలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం వంటివి భారతీయ విధానమని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బలమైన సమాజం ఉంటుందని వివరించారు. క్రీడలతో అ÷–లథెట్లు, కోచ్‌లు, ట్రైనర్లకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ టూరిజంతో పెట్టుబడులు, అంతర్జాతీయ ఈవెంట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ వస్తుందని స్పష్టం చేశారు. నెల్లూరు కేంద్రంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, అపెరల్, టెక్నాలజీ తయారీ కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధమని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని వెల్లడించారు. బ్రిక్స్ దేశాల మధ్య అ÷–లథెట్లు, కోచ్‌ల పరస్పర మార్పిడికి అవకాశం ఉందని చెప్పారు. వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత, సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ బలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కూలిన భవనం..ఇద్దరి దుర్మరణం

**మొదటిపేజీ తరువాయి**

మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

‘విక్టిమ్ లొకేషన్ సిస్టమ్‘ సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

# విద్యా,పరిశోధనలకుకేంబ్రిడ్జ్ సహకారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా సీఎం కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, ‘ఫ్రూగల్ ఏఐ’ కో–చైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్ర మాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొనేందుకు వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే ‘తెలంగాణ రైజింగ్’ లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూరుస్తున్నదని చెప్పారు.

సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ

లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శిస్తామని తెలిపింది.

# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

**మొదటిపేజీ తరువాయి**

ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.

ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బ్రేక్.. కేంద్రంపై ఖర్గే ఫైర్

**ఢిల్లీ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సాగాల్సిన ఈ పర్యటనను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే, విదేశీ పర్యటనల ద్వారా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు పెట్టుబడులను ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. “అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని ఆహ్వానించేందుకే ముఖ్యమంత్రులు ఇటువంటి పర్యటనలు చేపడుతుంటారు. అలాంటి కీలక పర్యటనకు అనుమతి నిరాకరించడం అన్యాయం“ అని ఆయన మండిపడ్డారు.

“కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తోంది, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది“ అని మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు లభించే పెట్టుబడులు అంతిమంగా దేశాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కీలక పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతికి విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదని మల్లికార్జున ఖర్గే హితవు పలికారు.

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

## భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):**



రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్‌ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

# సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం

## పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం -బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది

## ఎన్నికల్లో నిజాయితీపరులనే గెలిపించాలి కడియం శ్రీహరి








**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త);**పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో సన్న బియ్యం పంపిణీతోపాటు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. పేదల కడుపు నింపాలన్న చిత్తశుద్ధి కేంద్ర ప్రభుత్వానికి ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్‌లో, వేలేరు మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి 6 లక్షల రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 10 లక్షల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ. 13,800 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

**తప్పుడు ప్రచారాలు సరికాదు:**కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని కడియం శ్రీహరి ఆరోపించారు. ఆదిలాబాద్‌లో సంజీవరెడ్డి అనే వ్యక్తికి, కాంగ్రెస్ నాయకులకు మధ్య జరిగిన గొడవను తనకు ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. కొన్ని యూట్యూబ్ చానళ్లకు నెలవారీ జీతాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులపై సంబంధం లేని వార్తలతో విషప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ రూపాయి అవినీతికి పాల్పడలేదని, నియోజకవర్గ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఎన్నికలు ఏవైనా నిజాయితీగా ఉండి ప్రజల కోసం పనిచేసే వారినే ఎన్నుకుంటేనే గ్రామాలు, నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు.

**సన్న బియ్యం పంపిణీ:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కడియం శ్రీహరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చించి పేదలకు సన్న బియ్యం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు కోరడంపై స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న కార్యక్రమానికి మోదీ ఫొటో ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేసే కేంద్రం పేదలకు కడుపునిండా అన్నం అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**వేలేరుకు గోదావరి జలాలు:** కొత్తగా ఏర్పడిన వేలేరు మండలానికి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించేందుకు మల్లన్నగండి లిఫ్ట్-1 పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే వేలేరుకు గోదావరి జలాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వేలేరు మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ఇప్పటికే రూ. 2.25 కోట్లు మంజూరయ్యాయని, ఎంపీడీవో కార్యాలయానికి మరో రూ. 2 కోట్లు త్వరలో మంజూరు కానున్నాయని తెలిపారు. నెల రోజుల్లో మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానన్నారు. వేలేరు నుంచి కొమ్ముగుట్ట వరకు రహదారి అభివృద్ధికి పంచాయతీరాజ్ హ్యామ్ పథకం కింద రూ. 14 కోట్లు మంజూరయ్యాయని, పనులను త్వరగా పూర్తి చేయిస్తామని చెప్పారు. వేలేరు మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారి పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. వేలేరుకు సాగునీరు తీసుకురాకపోయినా, మండల కార్యాలయాలు నిర్మించకపోయినా, రహదారి పనులు పూర్తి చేయకపోయినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడగనని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో ధర్మసాగర్, వేలేరు మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల భద్రత సమాజం ఉమ్మడి బాధ్యత

## 72 బాల్యవివాహాలకు అడ్డుకట్ట.. జిల్లాలో 65 పోక్సో కేసులు

## బాలల ప్రవర్తనలో మార్పులను ఉపాధ్యాయులు గమనించాలి: కలెక్టర్ స్నేహ శబరిష్, జడ్జి మురళీమోహన్




**మహబూబాబాద్/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** బాలల భద్రత సమాజం ఉమ్మడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.మురళీమోహన్ అన్నారు. బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, మాదకద్రవ్యాల వినియోగం, మొబైల్ వ్యసనం వంటి సమస్యలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విద్యాశాఖ సమన్వయంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు, బాలల రక్షణకు సంబంధించిన అధికారులకు శనివారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు అధికారుల దృష్టికి వచ్చిన 72 బాల్యవివాహాలను సంబంధిత శాఖల సమన్వయంతో అడ్డుకున్నామని కలెక్టర్ తెలిపారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలికలు విద్యకు దూరమై ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. బాల్యవివాహాన్ని కుటుంబ వ్యవహారంగా కాకుండా బాలిక భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్యగా చూడాలని సూచించారు. పాఠశాలలు, బాలికల వసతి గృహాల తనిఖీల సందర్భంగా బడి మానేసిన కొందరు టీనేజ్ బాలికలు గర్భం దాల్చిన విషయాన్ని గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. బడి మానేయడానికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థుల మార్కులనే కాకుండా వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను కూడా ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు. కుటుంబ పరిస్థితులు, మానసిక స్థితి, స్నేహాలు, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి అంశాలను పరిశీలించి అవసరమైనప్పుడు తల్లిదండ్రులు, అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65 పోక్సో కేసులు నమోదయ్యాయని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.మురళీమోహన్ తెలిపారు. బాలలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టంపై గ్రామస్థాయి నుంచి పాఠశాలల వరకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు బాలలపై లైంగిక, మానసిక వేధింపుల నివారణకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల రక్షణ ఇంటి నుంచే ప్రారంభం కావాలని అధికారులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం కల్పించాలని కోరారు. పిల్లల ప్రవర్తనలో అనూహ్య మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా కారణాలను తెలుసుకోవాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల విక్రయాలు, సరఫరాపై జిల్లాలో కఠిన నిఘా కొనసాగుతోందన్నారు. యువత తమ శక్తిని చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వైపు మళ్లించాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ జ్ఞానాన్ని పెంచే సాధనంగా ఉండాలి తప్ప జీవితాన్ని నియంత్రించే వ్యసనంగా మారకూడదని కలెక్టర్ అన్నారు. అవసరానికి మించి తెరను చూడటం తగ్గించాలని, కుటుంబంతో గడిపే సమయంలో, నిద్రించే సమయంలో మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువతలో చట్టాలపై అవగాహన పెంచి సురక్షిత సమాజాన్ని నిర్మించడమే పోలీసుల లక్ష్యమని ఎస్పీ డాక్టర్ శబరిష్ తెలిపారు. పోక్సో చట్టం, మంచి స్పర్శచెడు స్పర్శ, రహదారి భద్రత, మైనర్ల వాహనాల నడపడం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. షీ బృందాలు, సైబర్ నేరాల విభాగం, పోలీసు గస్తీ ద్వారా విద్యార్థులు, యువతకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిసినా, బాలలపై వేధింపులు జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా మౌనం వహించవద్దని అధికారులు సూచించారు. సమాచారం ఇవ్వడం ద్వారా ఒక బాలుడి జీవితాన్ని కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు 112, 100, బాలల సహాయం కోసం 1098, మహిళల సహాయం కోసం 1091, సైబర్ నేరాల కోసం 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలల రక్షణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా ముగియకుండా ప్రతి పాఠశాల నుంచి ప్రతి ఇంటికి చేరాలని అధికారులు ఆకాంక్షించారు. ఒక ఉపాధ్యాయుడు గమనిస్తే ఒక బాల్యవివాహం ఆగవచ్చని, ఒక తల్లిదండ్రి పిల్లలతో మాట్లాడితే వారి సమస్య బయటపడవచ్చని, ఒక పౌరుడు సమాచారం ఇస్తే ఒక చిన్నారి జీవితం కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి చి.పంచాక్షరి దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శాలిని షాకేలి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీడబ్ల్యూసీ సభ్యురాలు నాగవాణి తదితరులు పాల్గొన్నారు

# ప్రతి సోమవారం మండలంలో ప్రజావాణి

**హసన్‌పర్తి/ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండలంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు
ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు
ఈ కార్యక్రమంలో మండల స్థాయిలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు ప్రజలు తమ సమస్యలు ఫిర్యాదులు ఇతర గ్రీవెన్సులకు సంబంధించిన దరఖాస్తులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందాలని అధికారులు కోరారు

# వైటీపీఎస్ వ్యర్థ జలాలు అన్నమేరు వాగులోకి కృష్ణానదికి ముప్పు

## వీర్లపాలెంతల్లావీరప్పగూడెం మధ్య ప్రవహిస్తున్న అన్నమేరు వాగు

**దామరచర్ల/ ఆగస్టు 22 (జర్నలిస్ వార్త);**
నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు అన్నమేరు వాగులోకి చేరుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు
వీర్లపాలెంతల్లావీరప్పగూడెం గ్రామాల మధ్య నుంచి ప్రవహిస్తున్న అన్నమేరు వాగులోకి విద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల నుంచి కలుషిత నీరు చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారువ్యర్థ జలాలు వాగులోకి చేరుతున్నట్లయితే అవి వాగు వెంట ప్రవహించి చివరకు కృష్ణానదిలో కలిసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారుదీంతో అన్నమేరు వాగు నీటితోపాటు కృష్ణానది నీటి నాణ్యతపై కూడా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారుగతంలోనూ వ్యర్థ జలాల విషయంలో ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారుఅన్నమేరు వాగులో నీటి నమూనాలు



సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని నీటిలో హానికర రసాయనాలు ఉన్నాయా లేదా నిర్ధారించాలని కోరుతున్నారుయాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వ్యర్థ జలాలు వాగులోకి చేరుతున్నాయా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారువ్యర్థ జలాలు వాగులోకి చేరుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు కాలుష్య నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారుకృష్ణానదిలో కలిసే నీటి వనరుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పర్యావరణ పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు

# బయ్యారంలో ఘనంగా నిశ్చితార్థ వేడుకలు



**కేసముద్రం/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త);**బయ్యారం పెద్దతండాలో శనివారం నిశ్చితార్థ వేడుకలు ఘనంగా నిర్వహించారు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు రేకులతండాకు చెందిన తేజావత్ లచ్చు అల్లి దంపతుల కుమారుడు తేజావత్ సురేష్ సుస్మితల నిశ్చితార్థ వేడుకలకు బంధుమిత్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న నాయక్ వేడుకలకు హాజరై నూతన జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దారావత్ కిషోర్ వీరు నాయక్ బానోత్ మహేష్ రగడ బానోత్ శ్రీను తేజావత్ లల్సింగ్ బాధావత్ సుమన్ తేజావత్ మహేష్ తేజావత్ రాజేష్ గుగులోత్ మహేష్ భూక్యా సేవల్ బానోత్ సంతోష్ బానోత్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు

# అస్వస్థతకు గురైన బానోత్ హచికి అల్లం నాగేశ్వర్‌రావు పరామర్శ



**కేసముద్రం/ ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు లచ్చిరాం నాయక్‌తండాకు చెందిన బానోత్ వెంకటేష్ తల్లి బానోత్ హచి కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతూ వరంగల్‌లోని రోహిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ వైస్‌చైర్మన్ దన్నసారి అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న నాయక్ ఆసుపత్రికి వెళ్లి హచిని పరామర్శించారు. వైద్యులను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అల్లం గణేష్, బనిశెట్టి వెంకటేష్, భూక్యా సేవల్ తదితరులు పాల్గొన్నారు.

# 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు బంద్



**తల్లాడ/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఈ నెల 23న అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నారని మదర్ థెరిస్సా యూనియన్ అధ్యక్షుడు నారపోగు రమేష్‌బాబు తెలిపారుడ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు ప్రతి ఏటా డ్రైవర్లకు రూ 12 వేల ఆర్థిక సాయం అందించాలని డ్రైవర్ల రక్షణ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ పర్మిట్ విధానం అమలు చేయాలని కోరారుతమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని రమేష్‌బాబు స్పష్టం చేశారు ఆటోలు క్యాబ్‌లు నిలిచిపోవడంతో ప్రయాణికులు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు

# జన్ను గణేష్‌కు ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ బాధ్యతలు



**వరంగల్ జిల్లా/ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్‌గా జన్ను గణేష్ నియమితులయ్యారు. కిలా వరంగల్ మండలం నక్కలపెల్లిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. దళితుల్లో ఐక్యత, చైతన్యం కోసం ఈ నెలాఖరులో దళిత ఐక్యత మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జన్ను గణేష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 56వసారి రక్తదానం.. సేవలో స్ఫూర్తి



**హుజురాబాద్/ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధి గాలిపెల్లి కుమార్ పిలుపునిచ్చారు. చిరంజీవి సేవా స్ఫూర్తితో గత 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన తాజాగా 56వసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. చిరంజీవి జన్మదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకులో గాలిపెల్లి కుమార్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరాతో రాసే అక్షరం కాగితానికే పరిమితం కావచ్చు. కానీ దానంగా ఇచ్చే రక్తబొట్టు మరో మనిషికి నూరేళ్ల ఆయుష్షునిస్తుంది' అన్నారు. అత్యవసర వేళల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదన్న లక్ష్యంతో తమ సంఘం నిరంతరం సేవలందిస్తోందన్నారు. ఎక్కడ ఎవరికీ రక్తం అవసరమైనా తమ చిరంజీవి సేవా సంఘాన్ని సంప్రదిస్తే తక్షణమే స్పందిస్తామని తెలిపారు. రక్తదానం విషయంలో యువత ముందుండాలని, అపోహలను వీడి ప్రాణాలను కాపాడే మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాగా గాలిపెల్లి కుమార్ 56వసారి రక్తదానం చేయడంపై చిరంజీవి అభిమాన సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్, గోపరాజు శ్రీనివాస్, మెగా యూత్ ఫోర్స్ తెలంగాణ కన్వీనర్ కసా రాజు, ఉత్తర తెలంగాణ కన్వీనర్ మిడిదొడ్డి కపిల్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు

# భీమదేవరపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రైతుల ఇబ్బందులు

## ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి





**భీమదేవరపల్లి/ఆగస్టు22 (జర్నలిస్ట్ వార్త):** మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీంతో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి అధికారులు, సిబ్బంది ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉండగా ఆలస్యంగా వస్తున్నారని, దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారంలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వంగర గ్రామానికి చెందిన ఓ రైతు విరాసత్ ఫైల్ గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉందని, తండ్రి మరణానంతరం వారసత్వంగా రావాల్సిన భూమికి సంబంధించిన సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ ఫైల్‌ను ఆర్డీవో కార్యాలయానికి రెండుసార్లు పంపగా తిరస్కరణకు గురైందని, మూడోసారి పంపించాలని కోరుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. మూడు సార్లు స్లాట్ బుక్ చేయడం వల్ల సుమారు రూ.20 వేల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయారని వెంకటస్వామి తెలిపారు. ఫైల్‌ను నిబంధనల ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని తహసీల్దార్‌ను పలుమార్లు కోరినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భీమదేవరపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, దళిత రైతుల భూ సమస్యలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని మాట్ల వెంకటస్వామి మాదిగ డిమాండ్ చేశారు. విరాసత్ ఫైల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తదుపరి వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

# సన్న వడ్లకు బోనస్.. నమోదు తప్పనిసరి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త);** సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ పొందాలంటే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ సూచించారు. శనివారం నారాయణగిరి గ్రామంలో సన్న రకాల వరికి బోనస్ వర్తింపునకు సంబంధించిన దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం బోనస్‌కు అర్హత కల్పించిన ఏడు సన్న రకాలైన ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, జైశ్రీరాం, హెచ్ఎంటీ సోనా, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యూజీఎల్ 44 రకాలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అధీకృత విత్తన డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు అక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. విత్తన డీలర్ల వద్ద కాకుండా ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రైవేటు విత్తన సంస్థల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన వారు, అలాగే సొంతంగా పండించిన విత్తనాలను సాగు చేసిన రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

బోనస్ కోసం రైతుల నమోదు ప్రక్రియకు సెప్టెంబరు 1 చివరి తేదీ అని రాజేష్ తెలిపారు. ఆన్‌లైన్ నమోదుకు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, స్వీయ ధ్రువీకరణ పత్రం అవసరమని పేర్కొన్నారు. అర్హులైన రైతులు గడువు ముగిసేలోగా నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే బోనస్‌ను పొందాలని కోరారు.

# మట్టి పరీక్షలతో మల్బరీ దిగుబడి పెంపు




**వరంగల్ /గంగాదేవిపల్లి ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** మల్బరీ తోటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే ముందుగా భూమి ఆరోగ్యాన్ని తెలుసుకోవాలని పట్టు పరిశోధకులు సూచించారు. మట్టి పరీక్షలు చేయించి, అందులో ఉన్న పోషకాల ఆధారంగా ఎరువులు వేస్తే మల్బరీ మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు నాణ్యమైన ఆకులు లభిస్తాయని తెలిపారు. గంగాదేవిపల్లిలో కేంద్ర పట్టు బోర్డుప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం (సీఎస్‌బీఆర్ఎస్ఆర్ఎస్), ములుగు ఆధ్వర్యంలో పట్టు పరిశ్రమ శాఖ సహకారంతో శనివారం ఎంఆర్ఎంఏ 2.0 సాంకేతిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్బరీ తోటలో మట్టి నమూనాలను ఎలా సేకరించాలో రైతులకు క్షేత్రస్థాయిలో చేసి చూపించారు. తోటలో ఎక్కడపడితే అక్కడ మట్టి తీసుకోకుండా. మొక్కల పరిస్థితి, భూమి స్వభావాన్ని బట్టి సరైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నిర్ణీత లోతులో మట్టిని తీసుకుని, ఇతర పదార్థాలు కలవకుండా జాగ్రత్తగా నమూనాలను సిద్ధం చేయాలని వివరించారు.

**ఎరువు వేసే ముందు పరీక్ష తప్పనిసరి**

మల్బరీ మొక్కలు నాటే ముందే మట్టి పరీక్ష చేయించుకోవాలని అధికారులు సూచించారు. అలాగే ప్రతి సారి అవసరానికి మించి ఎరువులు వేయకుండా. మట్టి పరీక్షలో వచ్చిన ఫలితాలను బట్టి ఏ పోషకం ఎంత అవసరమో తెలుసుకుని ఎరువులు వినియోగించాలని తెలిపారు. దీంతో రైతులకు ఎరువుల ఖర్చు తగ్గడంతోపాటు మొక్కలకు అవసరమైన పోషకాలు సక్రమంగా అందుతాయని వివరించారు.

**భూమి బలాన్ని తెలుసుకోవాలి**

మట్టి పరీక్ష ద్వారా భూమిలో ఆమ్లత్వం, క్షారత్వం (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చని తెలిపారు. భూమిలో ఏ పోషకం లోపించిందో గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులు అందిస్తే మల్బరీ ఆకుల నాణ్యత పెరుగుతుందని చెప్పారు. నాణ్యమైన ఆకులు అందుబాటులో ఉంటే పట్టు పురుగుల పెంపకంలోనూ మంచి ఫలితాలు సాధించవచ్చని రైతులకు వివరించారు.

కార్యక్రమంలో సీఎస్‌బీఆర్ఎస్ఆర్ఎస్ ములుగు శాస్త్రవేత్త భువన ఎస్, వరంగల్ సెరికల్చర్ అధికారి మల్లయ్య పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

# ప్రజాధనం ఎగ్గొడితే జైలుకే!




**మహబూబాబాద్/ ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** ప్రభుత్వ ధాన్యం అంటే రైతు చెమట. ప్రజల సొమ్ము. అలాంటి ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్ అయితే ఇక ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల శాఖ చర్యలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో సీఎంఆర్ బియ్యం డెలివరీలో డిఫాల్ట్ అయిన మిల్లర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రికవరీ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఐదు రైస్ మిల్లులపై కేసులు నమోదు కాగా. మిషన్ కె100లో భాగంగా మరో మూడు మిల్లులపై కేసులు నమోదు చేసి బకాయిలను రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. కేసముద్రంలోని శ్రీ తిరుమల బిన్నీ రైస్ మిల్లు, శ్రీ బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్ తదితర డిఫాల్ట్ మిల్లులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వెంగంపేటకు చెందిన ధనలక్ష్మి ఇండస్ట్రీస్ ఖరీఫ్ 202324 సీజన్‌లో సీఎంఆర్ డెలివరీలో డిఫాల్ట్ కావడంతో పలుమార్లు నోటీసులు జారీ చేసినా బకాయిలు చెల్లించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో కాలయాపన చేసినా. సీఎంఆర్ బియ్యం అప్పగించడంలో నిర్లక్ష్యం వహించినా. నిబంధనలు ఉల్లంఘించినా కేసులు నమోదు చేసి బకాయిలను రికవరీ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం రైతుల కష్టార్జితం కావడంతో ప్రజాధనాన్ని కాపాడే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని. డిఫాల్ట్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు. దీంతో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లలో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలతో ఇక సీఎంఆర్ బియ్యం వ్యవహారంలో నిర్లక్ష్యానికి తావులేదన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

# టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షుడిగా నారపోగు ప్రసాద్



**ఖమ్మం/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) మీడియా జిల్లా అధ్యక్షుడిగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నారపోగు ప్రసాద్ నియమితులయ్యారు. శనివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన టీసీసీ 13వ వార్షికోత్సవ సభలో ఆయన నియామకాన్ని రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. దీంతో బిల్లుపాడు గ్రామానికి చెందిన ప్రసాద్‌కు టీసీసీ జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించినట్లయింది.

ఈ సందర్భంగా టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మానుకొండ సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా నారపోగు ప్రసాద్ నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీసీసీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు సంస్థను మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. క్రైస్తవ సమాజానికి సంబంధించిన సమస్యలు, సంస్థ చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా మీడియా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన టీసీసీ రాష్ట్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకుల సూచనలు, సహకారంతో జిల్లాలో మీడియా విభాగాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తానని ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీసీసీ నాయకులు, ప్రతినిధులు నారపోగు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.




# డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



**హసన్‌పర్తి/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు హసన్‌పర్తి 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో యాదవనగర్‌లో పారిశుధ్య పనులు చేపట్టారుయాదవనగర్‌లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్న విషయాన్ని స్థానికులు కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన స్థానిక అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ జేసీబీ సహాయంతో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారుమలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు చేపడతామన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు

# సురవరం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతం

## సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్‌ఏ స్టాలిన్




**హసన్‌పర్తి/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** జాతీయ విప్లవోద్యమ నేతగా, మార్క్సిస్టు మేధావిగా, ప్రపంచ కార్మిక నేతగా సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్‌ఏ స్టాలిన్ అన్నారు. సురవరం ఆశయ సాధనకు పునరంకితమై ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారుసురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం హసన్‌పర్తి మండలం గుండ్లసింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో అరుణాంజలి, శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారుఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ 1942లో మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లిలో జన్మించిన సురవరం సుధాకర్‌రెడ్డి చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారని తెలిపారు. 1960 నాటికే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడిగా ఎదిగి 1966లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. 1972లో అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని పేర్కొన్నారు2007 నుంచి సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన సురవరం 2012 నుంచి 2019 వరకు మూడు పర్యాయాలు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఆయన రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరు పొందారని అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతంపై లోతైన అవగాహనతో వక్తగా, సిద్ధాంతకర్తగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు

1998, 2004 సంవత్సరాల్లో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా రెండుసార్లు ఎన్నికైన సురవరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని స్టాలిన్ తెలిపారు. నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ రహిత ప్రాంతంగా మార్చేందుకు విశేషంగా పోరాడారని, పార్లమెంట్‌లో సమర్థవంతంగా పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని చెప్పారు ప్రపంచ రాజకీయ పరిణామాలపై విస్తృత అవగాహన కలిగిన సురవరం తన ప్రసంగాలతో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేవారని అన్నారు. తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి పనిచేశారని తెలిపారు. తనకున్న ఆస్తులను సైతం ప్రజా సేవకు అంకితం చేసిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు

రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సురవరం చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని స్టాలిన్ అన్నారు. 2025 ఆగస్టు 22న ఆయన మృతి చెందడంతో భారత కమ్యూనిస్టు ఉద్యమం గొప్ప అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సురవరం రాజకీయ వారసత్వం, సిద్ధాంత స్పష్టత, ప్రజల పట్ల అంకితభావం వామపక్ష ఉద్యమాలకు ఎప్పటికీ దిక్సూచిగా నిలుస్తాయని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి అని స్పష్టం చేశారుకార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్‌చారి, పూజారి అమృతయ్య, కోడెపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, మాలోత్ మంగ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# కార్యకర్తలకు అండగా శంకర్‌నాయక్

## బాధిత కుటుంబాలకు పరామర్శ.. ధైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే





**కేసముద్రం/ ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు శనివారం కేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి అనారోగ్యం, ప్రమాదాలు, మృతిచెందిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు బేరువాడ గ్రామంలో ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా రామ్మూర్తిని శంకర్‌నాయక్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అదే గ్రామంలో ఆటో ప్రమాదంలో గాయపడిన మల్లేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు ఇటీవల మృతిచెందిన మాజీ సర్పంచ్ బోడా సిరినాయక్ తల్లి బోడ మంగమ్మ కుటుంబాన్ని కలిసి సంతాపం తెలిపారుధనసరి గ్రామంలో మాడాల యాకయ్య కుటుంబ సభ్యులను, గాంధీనగర్‌లో ఇటీవల మృతిచెందిన మాజీ సర్పంచ్ సక్రు సుక్కి తండ్రి అజ్మీర దేవుల కుటుంబ సభ్యులను పరామర్శించారు తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన కుంట వీరమ్మ, బలవంతుల సుశీల కుటుంబాలను కూడా కలిసి ఓదార్చారు పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా నిలుస్తామని శంకర్‌నాయక్ భరోసా ఇచ్చారుకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రావుల రవిచంద్రరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రావుల వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఈసం విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, ఏర్పుల సునీత, కుమారస్వామి, శంకర్, కదిరే ఉపేందర్, రమేష్, మాజీ ఎంపీటీసీలు బోడ కవిత, రాజేందర్, కొమ్ము రాహుల్, గొర్రె వెంకన్న తదితరులు పాల్గొన్నారు



## వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా తీజ్ వేడుకలు



**కేసముద్రం/ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త);** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలను కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ గిరిజన వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయిఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజనుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని కోరుకుంటూ ఈ పండుగను నిర్వహిస్తారని తెలిపారు. ముఖ్యంగా బంజారా మహిళలు, యువతులు తీజ్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారుగిరిజనుల ఆచార వ్యవహారాలు, కళారూపాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో తమ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఆధునికతకు అనుగుణంగా ముందుకు సాగుతూనే తమ మూలాలను మరువకుండా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

## వరికి పురుగు నివారణకు పసుపు పళ్లాలు




**నరసన్నపేట/ ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** వరి పంటను ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, కాండం తొలిచే పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకుడు పి గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనర్ తోట రమణ సూచించారు నరసన్నపేట మండలం రావులవలస యూనిట్ పరిధిలోని మడపాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు జిగురు పూసిన పసుపు, నీలం రంగు పళ్లాలు, లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారురైతులకు అందుబాటులో ఉండేలా ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వీటిని ఉంచుతామని తెలిపారు పసుపు, నీలం రంగు జిగురు పళ్లం రూ 5, లింగాకర్షక బుట్ట రూ 35కు లభిస్తాయని పేర్కొన్నారుఎకరాకు 10 పసుపు పళ్లాలు, 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు వీటిని వినియోగించడం ద్వారా వరి పంటలో పురుగు ఉధృతిని తగ్గించడంతో పాటు రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని పి గోవిందరెడ్డి వివరించారుకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## శంకర్ నాయక్ నీ వక్రబుద్ధి మార్చుకో..!

**-జిల్లా కలెక్టర్ చర్యలను తప్పుపట్టేంత మొనగాడివా..!**

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి.**



**బయ్యారం/,ఆగస్టు 22.(జర్నలిస్ట్ వార్త)** మహబూబాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ నీ వక్రబుద్ధి మార్చుకో ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం మండలం రాజకీయం నీకేం తెలుసు..! జిల్లా పరిపాలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ను తప్పు పట్టే అంత మొనగాడివా..నువ్వు నీ పరిపాలన కాలంలో నువ్వు చెప్పిన పని చేయని అధికారులను ఎంతమంది బదిలీ చేశావు మాకు తెలియదా..అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శ మూల మధుకర్ రెడ్డి మాజి ఎమ్మెల్యే వ్యవహార శైలీపై తీవ్రంగా దుయ్యబట్టారు.శనివారం కోదండ రామ ఆలయం ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత జులై మాసం నుండి బయ్యారం సొసైటీలో జరిగే చర్యలపై ఏమీ తెలుసుకోకుండా శంకర్ నాయక్ అవాక్కులు చెవాక్కులు పేలుతున్నాడని మండిపడ్డారు.బదిలీ అయిన జిల్లా సహకార సంఘం అధికారి విజయ కుమారి తన విధులను సక్రమంగా నిర్వహించకుండా వచ్చి నెల రోజుల కాల వ్యవధిలోని బయ్యారం సొసైటీపై పడి నానా రభస చేసిన విషయం జిల్లా మెజిస్ట్రేట్ కు తెలియ పరచకుండా ఉన్న సమయంలో పరిపాలన విభాగంలో అంతరాలు ఏర్పడటంతో విషయాన్ని తెలుసుకొని డిసిఓపై కలెక్టర్ చర్యలు తీసుకోవడం జరిగిన విషయం విధితమే..సొసైటీ విధి విధానాలు బైలా తెలియకుండా వ్యవహరిస్తూ పాలకవర్గ డైరెక్టర్ లను అవహేళన చేస్తూ వారి మాటలు పరిగణలో తీసుకోకుండా వారికి నోటీసులు జారీ చేయకుండా..ఒంటెద్దు పోకడతో బయ్యారం సొసైటీ కి తాత్కాలిక చైర్మన్ నియమించారు.చైర్మన్ విషయంపై మేము తప్పు పట్టడం లేదని,,డిసిఓ పని తీరుపై వారి చర్యలపై మాత్రమే విమర్శిస్తున్నామని తెలిపారు.డిసిఓ సంబంధిత వారిపై రాష్ట్ర సహకార సంఘ కమిషనర్ విధివిధానాలను తెలియపరచకుండానే ఆమె సొంత నిర్ణయాలు ఆమె మెడకు చుట్టుకోవడం జరిగిందని,దానిని కాంగ్రెస్ పార్టీకి,నాకు ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు.శంకర్ నాయక్ బయ్యారం మండల రాజకీయంతో పనేంటని డిసిఓకు శంకర్ నాయక్ ఉన్న ఫెవికాల్ బంధం ఏమిటో తెలపాలని సవాలు విసిరారు. అధికారులు మతాల,కులాల విభజన చూసి పనులు చేయరని గుర్తు చేశారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు కానీ అధికారుల పక్షాన వకల్తాపుచ్చుకొని బయ్యారం సొసైటీ పై మాజీ చైర్మన్ గా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయన మధుకర్ రెడ్డి పై పదే పదే అవాక్కులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు.గత లేడి కలెక్టర్ తో ఎలా అనుచితంగా ప్రవర్తించాడో.. రాష్ట్ర ప్రజలకు తెలుసని,ఆయన నీతులు చెప్పాల్సిన పని లేదని గుర్తు చేశారు.నియోజక వర్గంలో తన బినామీ ఆస్తులను కాపాడుకునేందుకు ఇప్పుడున్న జిల్లా కలెక్టర్ ను జిల్లా ఎస్పీని బదనాం చేసి , బ్లాక్ మెయిలింగ్ లకు పాల్పడతా..అని... తమ రాజకీయం పబ్బం గడుపుకునేందుకు,అసబంద్ధత మాటలు మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన విధంగా మానుకోట జిల్లా ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. సొసైటీ బై లా ఏమి తెలుసని విమర్శిస్తున్నారని అన్నారు .డిసిసి చర్యలపై బహిరంగ చర్చకు ఎక్కడ వేదిక ఏర్పాటు చేసిన అక్కడికి వస్తానని శంకర్ నాయక్ కు సవాల్ విసిరారు .డిసిఓ చర్యలపై తప్పని తెలిస్తే నీవు రాజకీయ సన్యాసం చేస్తావా.. లేదంటే పోయిన డిసిఓ చర్యలు సరైనదే అని మేధావులు వద్ద మీరు సరైనదే అనిపిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా.. ముక్కు నేలకు రాస్తా.. అని అన్నారు ,సమయం వేదిక మీరే చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, బయ్యారం మండలం కాంగ్రెస్ నాయకుల సర్పంచులు ప్రవీణ్ నాయక్,లింగా నాయక్,భూక్య రవి నాయక్,పానుగోతు వెంకన్న,ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కిట్స్ వరంగల్ సిఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రావుల రాజేష్ కు డాక్టరేట్





**హసన్ పర్తి/ఆగస్టు 22(జర్నలిస్ వార్త):** వరంగల్‌లోని కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్‌డబ్ల్యూ) లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న రావుల రాజేష్‌కు, ఎడ్జ్ కంప్యూటింగ్, వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్‌లు, అడాప్టివ్ రూటింగ్ , లైట్‌వెయిట్ సెక్యూరిటీ అంశాలపై చేసిన పరిశోధనకు గాను అస్సాం రాష్ట్రం లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్ ద్వారా డాక్టరేట్ (పీహెచ్ డి) డిగ్రీ ప్రదానం చేసినట్లు కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి సగర్వంగా తెలిపారుశనివారం విడుదల చేసిన ప్రెస్ నోట్ లో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ రావుల రాజేష్ తన పీహెచ్ డి థీసిస్ ను. ఇంటలిజెంట్ ఎనర్జీ-ఎఫీషియెంట్ హ్యాండ్ సెక్యూరిటీ రూటింగ్ ప్రోటోకాల్స్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ వైర్లెస్ సెన్సార్ నెట్వర్క్ అనే శీర్షికతో సమర్పించినట్లు తెలిపారు. ఆయన తన పరిశోధనను నిట్ సిల్చార్ సాంకేతిక విద్యాలయం కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ రిపోన్ పాట్‌గిరి (సూపర్‌వైజర్), అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డోలెంద్రో సింగ్ (కో-సూపర్‌వైజర్) ల సంయుక్త పర్యవేక్షణలో పూర్తి చేశారు.

ఆయన చేసిన డాక్టరల్ పరిశోధనలో భాగంగా, తదుపరి తరం వైర్‌లెస్ మరియు ఎడ్జ్-ఎనేబుల్డ్ నెట్‌వర్క్‌లలో శక్తి సామర్థ్య కమ్యూనికేషన్, ఇంటెలిజెంట్ రూటింగ్, భద్రత మరియు వనరుల ఆప్టిమైజేషన్ రంగాలకు ఆయన చేసిన గణనీయమైన కృషిని ప్రముఖంగా ప్రస్తావించారు. వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్‌లు, ఎడ్జ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రూటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు గణనీయంగా దోహదతుంది. ఆయన ప్రతిష్టాత్మక జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్ మరియు కాన్ఫరెన్స్‌లలో పరిశోధనా పత్రాలను కూడా ప్రచురించారు అని ఆయన హైలైట్ చేశారు.

ఈ సందర్భంగా ఫార్మర్ రాజ్యసభ ఎంపీ, కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి మరియు హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వి. సతీష్ కుమార్ ఏకశిల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, అలాగే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి బి ఎడ్జ్ కంప్యూటింగ్, వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్‌లు రంగంలో సమాజానికి ఉపయోగపడే, అన్వయించదగిన పరిశోధన నిర్వహించినందుకు రావుల రాజేష్ ను, సిఎస్ఈ విభాగంకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అదేవిధంగా సిఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. నిరంజన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకరా చారి నిట్ సిల్చార్ విద్యాలయం ద్వారా పీహెచ్డీ డిగ్రీ పొందిన సందర్భంగా రావుల రాజేష్ కు శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు పంచుకున్నారు.

# క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి





### టి.సి.సి 13వ వార్షికోత్సవ సభలో డిమాండ్

**ఖమ్మం/ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):** క్రైస్తవులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల రుణాలను ఎస్సీ, బీసీలకు అందిస్తున్న తరహాలోనే మంజూరు చేయాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ ఎం.డి. సుదర్శనం డిమాండ్ చేశారుఖమ్మం మంచికంటి భవన్‌లో టి.సి.సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎస్. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 13వ వార్షికోత్సవ సభ నిర్వహించారు ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు క్రైస్తవులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు సమస్యల పరిష్కారానికి టి.సి.సి రాష్ట్ర కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారుబిషప్ ఎం.డి. సుదర్శనం మాట్లాడుతూ ప్రతి పాస్టర్‌కు ముస్లిం మౌజన్లకు, హిందూ మత పూజారులకు అందిస్తున్న విధంగా నెలవారీ ఆర్థిక సహాయం అందించాలని కోరారు క్రైస్తవులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని ఏజెన్సీ ప్రాంతాల్లో చర్చిల నిర్మాణానికి స్థల అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారుకార్యక్రమంలో టి.సి.సి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. నిరక్షణరావు, పి. యేసుదాసు, సి.హెచ్. రమేష్‌బాబు, జార్జి ముల్లర్, ఎస్. డేవిడ్ రాజు, టి. మధుసూదన్, టి. ఆనందరావు, జిల్లా సభ్యులు జి. బాబురావు, రాజారత్నం, అద్భుతకుమార్, ఖమ్మం పట్టణ నాయకులు పి. జేకర్యా హనుమంతరావు, వేముల సత్యం, పాల్ సంజీవరావు, ఆనందరావు, బి. పాల్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల క్రైస్తవ నాయకులు కె.వి. ఇజ్రాయిల్, దేవసహాయం, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు

## సంతులాల్ పోడుతండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.





**బయ్యారం/,ఆగస్టు 22.(జర్నలిస్ట్ వార్త)** అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.బయ్యారం మండలం సంతులాల్ పోడు తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ మణి,తహసీల్దార్ నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదని,పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కీలక ఆధారమని అన్నారు.గతంలో అర్హత ఉన్న అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు అందక సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి రేషన్ కార్డులు అందించే ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,ఇల్లందు మార్కెట్ చైర్మన్ అంగోత్ రాంబాబు,ఆర్ఐ సందీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో సిరిపురం మేజర్ ద్వారా తల్లాడకు గోదావరి జలాలు



**తల్లాడ /ఆగస్టు 22 జర్నలిస్ వార్త**

తల్లాడ మండలానికి త్వరలో సిరిపురం మేజర్ కాలువ ద్వారా గోదావరి జలాలు అందనున్నాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి తెలిపారుమండలంలోని చెరువులను శనివారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డితో కలిసి పరిశీలించారు అనంతరం విలేకరులతో మాట్లాడారుతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలు సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడ మండలానికి రావాల్సి ఉండగా కాలువ మరమ్మతుల కారణంగా నీటి విడుదల నిలిచిపోయిందన్నారు దీంతో తల్లాడ మండలంతో పాటు పరిసర గ్రామాల రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారుఈ విషయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశామన్నారు తమ విజ్ఞప్తిపై స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు సిరిపురం మేజర్ కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేసి లక్ష్మీనగర్ వరకు కాలువను సిద్ధం చేశారని త్వరలో నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారుదీంతో అన్నారుగూడెం బిల్లుపాడు వెంకటగిరి గోపాలపేట తల్లాడ తెలగవరం గొల్లగూడెం అంజనపురం తదితర గ్రామాల రైతులకు భారీ ఊరట లభించనుందని తెలిపారు గోదావరి జలాలు అందుబాటులోకి రానుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారునీటిని విడుదల చేసేందుకు సహకరించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ నీటిపారుదల శాఖ అధికారులకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారుకార్యక్రమంలో తెలగవరం సర్పంచ్ భూక్య కాలోజీ అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ బండి బాలసౌరి ఉప్పెల రామారావు తదితరులు పాల్గొన్నారు

## రసమల్ల అనిల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.





**బయ్యారం/,ఆగస్టు 22.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామంలో ఆటో యాక్సిడెంట్ లో మృతి చెందిన రసమల్ల అనిల్ యాదవ్ మాతృమూర్తి రాసమల్ల మంగమ్మ కుటుంబాన్ని శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు.మంగమ్మ కొడుకు అనిల్ ని ఓదార్చి మనోధైర్యం కల్పించి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.ఎమ్మెల్యే వెంట మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్,ఇల్లెందు మార్కెట్ చైర్మన్ బానోతు రాంబాబు,ఇస్లాపురం సర్పంచ్ ఎట్టి సరోజిని,ఉప సర్పంచ్ ఏనుగుల రాకేష్ తదితరులు ఉన్నారు.

## బయ్యారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే.







**బయ్యారం/,ఆగస్టు 22.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా చాగర్లమూడి భాస్కర్ వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ అధికారి కే.రాజు,ఏడిఏ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పెసర విత్తనాలు చల్లే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.పొలంలో దుక్కి దున్నిన ఎమ్మెల్యే కోరం కనకయ్య రైతులతో కలిసి పొలంలో దుక్కి దున్నారు.తానే రైతుగా మారి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు,మెరుగైన ఆదాయం పొందేలా ముందుకు సాగాలని రైతులను కోరారు.కొత్తపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ భుక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరిగోడ నిర్మాణానికి మంజూరైన 30 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని ధానం చేసిన వెంకటేశ్వరరావుని ఎమ్మెల్యే సన్మానించారు.కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,ఎంపిడివో దీపిక,గుగులోత్ మణి,అవిరినేని వెంకటేశ్వరరావు,వడ్లముడి కొటేశ్వరరావు,శ్రీనివాసరావు,సురేష్, పల్లయ్య,రామూర్తి తదితరులు పాల్గోన్నారు.

# మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దు

### గౌరవెల్లి నీటిపై స్పష్టత ఇవ్వాలి పృథ్విరాజ్‌గౌడ్

**భీమదేవరపల్లి/ఆగస్టు22 (జర్నలిస్ట్ వార్త):** పల్లె పల్లెకు పొన్నం అన్న కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం మండలంలో ఐదు గ్రామాల్లో పర్యటించి గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్తకొండ మండలం ఏర్పాటు, వీరభద్రస్వామి దేవస్థానం భూముల సమస్యలపై ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్‌గౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తిస్థాయిలో నింపడం లేదో మంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కింద రూ.450 కోట్లు వచ్చాయని ఒకసారి, రూ.250 కోట్లు వచ్చాయని మరోసారి చెప్పడం ప్రజలను అయోమయానికి గురిచేస్తోందన్నారు. రూ.450 కోట్లా రూ.250 కోట్లా? లెక్క ఒక్కటే ఉండాలి అన్నారు. కొత్తకొండ మండలం ఏర్పాటు ఎప్పటిలోగా చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని, దేవస్థానం భూముల సమస్యను పరిష్కరించాలని కోరారు. మాటల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పనుల్లో మాత్రం అడుగు కదలడం లేదు అని విమర్శించారు. మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దని పృథ్విరాజ్‌గౌడ్ అన్నారు.



# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

### సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలపై సండ్ర ఆగ్రహం





**సత్తుపల్లి /ఆగస్టు 22 (జర్నలిస్ వార్త):**

సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు 100 పడకల నూతన ఆసుపత్రి భవనం అందుబాటులోకి రావడంతోపాటు సుమారు 17 మంది వైద్యులు ఉన్నప్పటికీ పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం అందకపోవడం బాధాకరమన్నారు నిరుపేదలు సామాన్య ప్రజలు ప్రధానంగా ఆశ్రయించే ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారుకొంతమంది వైద్యులు విధులకు సమయానికి హాజరు కావడం లేదని మరికొందరు ముందుగానే విధుల నుంచి వెళ్లిపోతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సండ్ర తెలిపారు ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు ఈ ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారుఆసుపత్రిలో మంచినీటి సదుపాయం సక్రమంగా లేకపోవడం మృతదేహాలకు సకాలంలో పోస్టుమార్టం నిర్వహించకపోవడం వంటి సమస్యలపైనా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు కొన్ని ధ్రువపత్రాల జారీ కోసం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని వీటిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని సండ్ర డిమాండ్ చేశారు ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు మందులు చికిత్స అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారుఇటీవల రేజర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పాము కాటుకు గురైన అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా సుమారు రెండున్నర గంటలపాటు పాము విషానికి విరుగుడు మందు అందలేదనే ఆరోపణలు వచ్చాయని సండ్ర తెలిపారు పరిస్థితి విషమించడంతో బాధితుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందన్నారు అత్యవసర వైద్యంలో ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా అవసరమైన మందులు పాము కాటుకు సంబంధించిన విరుగుడు మందులు వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారురోగుల ప్రాణాలకు సంబంధించిన విషయంలో రాజకీయాలకు ఒత్తిళ్లకు తావుండకూడదని సండ్ర స్పష్టం చేశారు రాజకీయాలు వేరని ప్రజల ప్రాణాలు వేరని అన్నారు ముఖ్యంగా పేదలు ఆశ్రయించే ప్రభుత్వాసుపత్రుల్లో మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులు సిబ్బందిపై ఉందన్నారు వైద్య వృత్తిని ప్రజలు ఎంతో పవిత్రంగా భావిస్తారని వైద్యులను భగవంతుడితో సమానంగా గౌరవిస్తారని గుర్తుచేశారు ప్రజలు వైద్యులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులు నిర్వహించాలని కోరారువైద్యులు సిబ్బంది విధి వేళల్లో అందుబాటులో ఉండడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్యం అందించాలని సండ్ర సూచించారు ఓపీతోపాటు అన్ని విభాగాల్లోనూ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఆసుపత్రిలోని సమస్యలను తక్షణమే పరిష్కరించి సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి మంచి పేరు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారుప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దని ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి రోగికి గౌరవంగా బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలని సండ్ర అన్నారు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించాలని వైద్యులు సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కోరారుప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి అత్యవసర వైద్య సేవల్లో ఎలాంటి జాప్యానికీ తావులేకుండా చూడాలి ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి అని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు

# సెప్టెంబర్ 9న చలో వరంగల్ కు కదలాలి

### ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందరికీ దక్కాలి -బిర్రు మహేందర్ మాదిగ పిలుపు







**భువనగిరి/ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి, దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవన్‌లో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్‌ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు

ఎస్సీ వర్గీకరణ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. మాదిగల హక్కులు, ఆత్మగౌరవం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. జాతీయ మహాసభకు భువనగిరి నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

**నూతన పట్టణ కమిటీ**

సమావేశంలో ఎమ్మార్పీఎస్ భువనగిరి పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందె సాయి మాదిగ, అధికార ప్రతినిధిగా కలకొండ శ్రీధర్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దండు గణేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పొలిశెట్టి సతీష్ మాదిగ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, ఎంఎస్పీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి సందేలా శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, గ్రామ సర్పంచ్ పల్లెపాటి రాజలింగం, ఎంఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గద్యపాక శంకర్ మాదిగ, బండారు శివశంకర్ మాదిగ, కోట ఉపేందర్ మాదిగ, నరికడప నర్సింగ్‌రావు





మాదిగ, మంచాల మహేష్ మాదిగ, నరికడప మధు మాదిగ, గూడెంకి ప్రమోద్ మాదిగ, బర్రె వరుణ్ మాదిగ, ఇటుకల మహేందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# తప్పును కప్పిపుచ్చుకునేందుకే రాజకీయ రాద్ధాంతమా..?

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్





**వర్ధన్నపేట/ఆగస్టు 22 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అక్రమ కేసుల ఆరోపణలు పచ్చి అబద్ధమని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్ అన్నారు. శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జాతీయ జెండా గౌరవం, చట్టపాలన విషయంలో రాజకీయాలకు తావివ్వడం సరికాదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతోపాటు జాతీయ జెండా నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించారని తెలిపారు. నిబంధనల ప్రకారమే పోలీసులు, అధికారులు చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్షసాధింపులు లేవని స్పష్టం చేశారు.నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని వెంకన్నగౌడ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, చిట్టూరి రాజు, సిద్ధం లక్ష్మీనారాయణ, మరుపట్ల అరుణ, సాయికుమార్, తీగల సునీత తదితరులు పాల్గొన్నారు.